క్లుప్తంగా

ఆరుకాళ్లతో లేగ దూడ జననం



ఆరు కాళ్లతో జన్మించిన లేగదూడ

సిరికొండ: మండలంలోని వాయిపేట్ గ్రామంలో ఓ రైతుకు ఉన్న ఆవు ఆరుకాళ్ల లేగదూడకు ఇటీవల జన్మనిచ్చింది. సహజంగా నాలుగు కాళ్లు మాత్రం అన్నింటికి ఉన్నట్లుగానే ఉంటూ ఈ దూడకు మాత్రం వీపుపై మరో రెండు కాళ్లు పుట్టడంతో విషయం తెలుసుకున్న పలువురు గ్రామస్తులు తిలకించేందుకు తరలివస్తున్నారు.

'మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకోం'

బోథ్: హిందువల మనోభావాలను దెబ్బతీసే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే ఊరుకునేది లేదని వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నాయకులు హెచ్చరించారు. బుధవారం వాట్సాప్ గ్రూప్‌లో ఓ వ్యక్తి హిందువల మనోభావాలను దెబ్బతీసే విధంగా పోస్టు చేయడంతో ఆయనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆ వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ నాయకులు నిఖిల్ గంగాజీ, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలు పంపిణీ

తాంసి: అయోధ్య అక్షింతలను బుధవారం మండల కేంద్రంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామంలోని ఆలయం నుంచి డప్పుచప్పుళ్లతో ఇంటింటా తిరుగుతూ అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, గ్రామ పెద్దలు వెంకట్ రెడ్డి, రామన్న యాదవ్, స్వామిరెడ్డి, మణికంఠ, రాజు, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని ధన్నూర్ గ్రామానికి చెందిన పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు సదాశివ్ నానమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా.. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ బుధవారం ఆయనను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్, పాముల గంగారాం, పట్టణ అధ్యక్షుడు మెరుగు భోజన్న, సురేందర్, గిరీష్, నారాయణ, శంకర్, బుచ్చన్న, లక్ష్మణ్, స్వామి, సంతోష్, రవీందర్, రమేశ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) క్యాలెండర్లను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత బుధవారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు చౌహాన్ దేవిదాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక పోచన్న, సోమ శ్యాంసుందర్ రెడ్డి, జావిద్ అలీ, సుకుమార్ పెట్కులే, అశోక్, శ్రీకాంత్ గౌడ్, రఘు, రమణ పాల్గొన్నారు.

సైనిక శిక్షణ శిబిరం విజయవంతం చేయండి

ఎదులాపురం: సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ఈనెల 26 వరకు సైనిక్ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భీంరావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. పట్టణంలోని అశోక బుద్ధ విహార్లో నిర్వహించే ఈ కార్యక్రమాలను విజయంతం చేయాలని కోరారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పట్టణంలో శోభాయాత్ర చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, జిల్లా నాయకుడు సోమోరే నాగోరావ్‌లు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ సానుకులంగా స్పందించి రెండు రోజుల్లో ఆధార్ కేంద్రం ఏర్పాటుకు చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

శివాజీ చౌక్‌ను అభివృద్ధి చేయాలి

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలని శివాజీ సైనిక్ పట్టణ అధ్యక్షుడు తాత్రే విద్యాసాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మాట్లాడారు. ఫిబ్రవరి 19న శివాజీ మహరాజ్ జయంతి వేడుకలలోపు అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పండ్ల వ్యాపారుల వలన కూడలి పరిసరాలు దుర్గంధ భరితంగా మారుతున్నాయన్నారు. కూడలి చుట్టూ ఉన్న తోపుడు బండ్లను తొలగించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను కోరారు.

ప్రయోగ పరీక్షలు ఎలా?

- మూడేళ్లుగా నిలిచిన రసాయనాల సరఫరా
- మొక్కుబడిగానే పరీక్షలు
- పట్టించుకోని అధికారులు



నేరడిగొండ జూనియర్ కళాశాలలోని ప్రయోగశాల

నేరడిగొండ: తరగతి గదిలో చదివిన విషయం కంటే ప్రయోగాత్మకంగా చేసింది ఎప్పటికీ గుర్తుండిపోతుంది. సైన్సు విద్యార్థులకైతే అవి తప్పనిసరి. ఇంటర్మీడియట్ రెండో సంవత్సర విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు ప్రయోగ తరగతులు నిర్వహించాలి. అందుకు అనుగుణంగా గతంలో ప్రభుత్వమే ఏటా ప్రయోగాలకు సంబంధించిన పరికరాలు, రసాయనాలు సరఫరా చేసేది. మూడేళ్లుగా ఆ సరఫరా నిలిచిపోవడంతో కళాశాలల్లో రసాయనాలు లేక అరకొరగానే ప్రయోగ తరగతులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పలు ప్రభుత్వ కళాశాలల్లో ఇప్పటికీ ప్రయోగ పరీక్షలకు సంబంధించిన ల్యాబ్‌లను తెరిచిన దాఖ లాలు లేవంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఫిబ్రవరి 1 నుంచి..

ఇంటర్మీడియట్ బోర్డు ఇటీవల వార్షిక పరీక్షల షెడ్యూల్ ప్రకటించింది. ఈమేరకు ఫిబ్రవరి 1 నుంచి ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వార్షిక పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలంటే ల్యాబ్‌లో ప్రయోగాలు చేస్తే విద్యార్థులకు సులువుగా అర్థమవుతుంది. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 28న ప్రారంభం కానున్నాయి. పరీక్షల సమయం దగ్గర పడుతుండడంతో రసాయన సామగ్రి కోసం లెక్చరర్లు, విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.

ఏటా ఇదే పరిస్థితి..

సైన్స్ విద్యార్థుల నుంచి ప్రత్యేక ఫీజు వసూలు చేసి కళాశాలకు అవసరమైన సైన్స్ సామగ్రి కొనుగోలు చేసేవారు. 2015లో ఉచిత విద్య పక్కాగా అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ప్రవేశాలకు రుసుము వసూలు నిలిపివేశారు. రెండేళ్ల పాటు ఇంటర్ బోర్డు నిధులు విడుదల చేసింది. తర్వాత ఆఊసే ఎత్తడం లేదు. అప్పటి నుంచి ప్రయోగశాలలు మొక్కుబడిగా మారాయి. జిల్లాలోని పలుచోట్ల ప్రయోగశాల పరికరాలు చోరీకి గురయ్యాయి. ప్రయోగ తరగతులు నిర్వహించాలంటే ఒక్కో కళాశాలకు ఏడాదికి కనీసం రూ.30 వేలు, వృత్తి విద్య ప్రయోగాలకు రూ.20 వేల వరకు అవసరం. భౌతిక, రసాయన శాస్త్రాలకు ఏడాదికి 40, వృక్ష, జంతు శాస్త్రాలకు సంబంధించి 24 చొప్పున ప్రయోగాలు చేయాల్సి ఉంటుంది. కానీ మూడేళ్లుగా ప్రభుత్వం ప్రయోగశాలలకు నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో పాత సామగ్రితోనే నెట్టుకోస్తున్నారు. అవి అందుబాటులో లేనిచోట ఇతర కళాశాల నుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకే ఇవి ఉపయోగపడతాయని, విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన రావడం లేదని నిపుణులు పేర్కొంటున్నారు.

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	13
ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ప్రథమ సంవత్సరం విద్యార్థులు	3,569
ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులు	3,233

నివేదికలు పంపుతున్నాం



ప్రయోగ పరీక్షలకు సంబంధించిన రసాయనాలు, ల్యాబ్ నిర్వహణ ఖర్చులు కొంత కాలంగా రావడం లేదు. ఫలితంగా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ ఇబ్బంది పడుతున్నారు. పరీక్షల నిమిత్తం కొందరు సొంత డబ్బులతో రసాయనాలు కొనుగోలు చేస్తున్నారు. నివేదికలు ఎప్పటికప్పుడు పంపుతున్నాం.

– రవీందర్, డీఐఈవో

సమష్టి కృషితోనే ఎమ్మెల్యేగా గెలుపు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



పాయల్ శంకర్ దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

జైనథ్: బీజేపీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తుల సమష్టి కృషితోనే తాను ఎమ్మెల్యేగా గెలిచానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. బుధవారం తన స్వగ్రామమైన అడ గ్రామంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మొదటిసారి గ్రామానికి విచ్చేసిన ఆయనకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పాయల్ శంకర్ తన సతీమణితో కలిసి గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఓడిపోయినప్పటికీ కార్యకర్తలు తనను విడిచిపెట్టలేదన్నారు. తనతో ఉన్నందుకు వారిపై తప్పుడు కేసులు పెట్టిన కూడా భయపడలేదన్నారు. గ్రామస్తులు, కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదని భావోద్వేనికి గురయ్యారు. అడ గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, లోక ప్రవీణ్ రెడ్డి, భోయర్ విజయ్, ఆదినాథ్, అంకత్ రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం



కండువా కప్పుతున్న కంది శ్రీనివాస రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యం కృషి చేస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిలు అన్నారు. బుధవారం మావల మండల కేంద్రంలోని తిరుమల క్లాసిక్ గార్డెన్‌లో కార్యకర్తల, నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని జైనథ్, బేల, ఆదిలాబాద్ రూరల్ మండలం, ఆదిలాబాద్ పట్టణంలోని పలు వార్డులకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గూడ సర్పంచ్ నిమ్మల ప్రభాకర్, కచికంటి సర్పంచ్ కుర్ర శ్రీనివాస్ లక్ష్మి, సీనియర్ నాయకులు రాజ్, మొహమ్మద్, సిడాం అయ్యు, దొన సర్పంచ్ రమీల వెంకట్ రెడ్డి, బూర్ల శంకరయ్య, ప్రవీణ్, సిద్ది ఇర్షాద్, ఫిరోజ్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే బోథ్ అభివృద్ధి సాధ్యం'



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆడే గజేందర్

తాంసి: బోథ్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని బోథ్ నిజయోకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. ఉపసర్పంచ్ ప్రణీత్‌రెడ్డితో పాటు గ్రామానికి చెందిన 20 మంది పార్టీలో చేరగా కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. ఆడే గజేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో అనేక సంక్షేమ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలయ్యాయని గుర్తు చేశారు. వారి వెంట తలమడుగు జెడ్పీటీసీ గణేష్ రెడ్డి, నాయకులు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, అన్ను పటేల్, ఖాశీం, శ్రీను, సుదర్శన్, మనీష్ రెడ్డి, హన్మండ్లు, అఫ్రోజ్ పాల్గొన్నారు.

40 దశాబ్దాల 'కార్తీకదీపం'



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని 40దశాబ్దాల సీసీఐ రామాలయంలో అరుదైన ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. ఆలయ ధ్వజస్తంభానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక దీపంలో ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో దీపాన్ని వెలిగిస్తున్నారు. సీసీఐ పరిశ్రమ మూతపడిన అనంతరం ఆలయం మరుగునపడినప్పటికీ, సీసీఐలో సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, స్థానికులు ప్రతి కార్తీక మాసంలో ఈ దీపాన్ని వెలిగిస్తూ తమ భక్తిని చాటుకుంటుండడం విశేషం. ఈ నెల 22న అయోధ్య శ్రీరామజన్మ భూమి నేపథ్యంలో ఈ ఆలయ పునరుద్ధరణ పనులను బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ ప్రత్యేక దీపాన్ని వెలిగించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

'ప్రజలను మోసం చేస్తే సహించేది లేదు'

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని మోమీన్‌పుర కాలనీలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ కార్యాలయాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భొజ్జు ప్రారంభించారు. ఈ సందరగా మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఇమ్రాన్‌తో పాటు మైనార్టీ పెద్దలు ఎమ్మెల్యే వెడ్మ భొజ్జు పటేల్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదల ప్రభుత్వం ఏర్పాటు అయిందన్నారు. త్వరలో ఆరు గ్యారంటీలు ప్రతి ఇంటికీ చేరుతాయన్నారు. పథకాల పేరిట ఎవరైనా.. ఎంతటి వారైనా.. సొంత వాళ్లైనా సరే ప్రజలను మోసం చేస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, ఎక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద మంజూరైన వంట గ్యాస్ కనెక్షన్‌లను బుధవారం మండలంలోని దహిగూడ గ్రామంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన వారిని గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలు అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో రేషన్‌కార్డు కలిగి ఉండి ఇప్పటివరకు గ్యాస్ కనెక్షన్ లేని వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన బీపీఎల్ కుటుంబాలు తమ దగ్గరలో ఉన్న గ్యాస్ ఏజెన్సీలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకము కింద అప్లికేషను సమర్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, తహసీల్దార్ దిలీప్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆదిలాబాద్ రూరల్ మండల కార్యవర్గాన్ని బుధవారం మండలంలోని తంతోలి శివారు ప్రాంతంలోని ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెస్రం కేశవ్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సెడ్మకి గంగారాం, ప్రధాన కార్యదర్శిగా మెస్రం రవి, ఉపాధ్యక్షుడిగా వెంకన్న, కినక అశోక్, మడావి జగదీష్, సలాం దౌలత్‌రావ్, కోశాధికారిగా తొడసం అశోక్, ప్రచార కార్యదర్శులుగా గెడం రాము, కుమ్ర సంతోష్, కార్యదర్శిగా దుర్వ మానిక్ రావ్, సలహాదారులుగా ఉయిక ఉశేంత్, గెడం బండు, తదితరులున్నారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్, జిల్లా నాయకులు పుర్క బాపురావ్, శ్యాంరావ్, దిగంభర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామంలో రూ.4.28 లక్షలతో నిర్మించే సైడ్‌డ్రైన్ నిర్మాణ పనులకు ఎంపీపీ తుల శ్రీనివాస్ బుధవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. మారుమూల ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. పూలాజీ బాబా మందిర నిర్మాణానికి రూ. లక్ష విరాళం అందజేశారు. కోట(కె) గ్రామంలో పాఠశాల మరమ్మతుల పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంద్రం సుగుణ, ఎంపీడీవో సుశీల్ కుమార్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, శ్రీధర్ రెడ్డి, జుగాదిరావ్, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణాన్ని జరిపిస్తున్న వేద పండితులు



ఉత్సవమూర్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో శ్రీభూగోదా సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ 17వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదు రోజులుగా ఆలయ వ్యవస్థాపకుడు శ్రీశివ దత్తగిరి మహరాజ్ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. చివరి రోజు కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య పద్మావతి, లక్ష్మి, వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ప్రత్యేక మండపంలో రాంగోపాల్‌చార్యులు, కల్యాణచార్యులు, ఉమాకాంత్‌ల మంత్రోచ్చారణల మధ్య కల్యాణం జరిపించారు. భీంపూర్, తాంసి మండలాలతో పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి వారి లడ్డూను వేలంపాట నిర్వహించగా.. గ్రామానికి చెందిన రాకేశ్ రెడ్డి రూ.29వేలు చెల్లించి దక్కించుకున్నాడు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్, తలమడుగు జెడ్పీటీసీ గణేష్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు.



కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులు

'ఆరోపణలు సరికాదు'

కైలాస్‌నగర్: రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరనే నానుడికి డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి నిదర్శనంగా నిలుస్తున్నారని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. మాజీ మంత్రి జోగు రామన్నపై భోజారెడ్డి చేసిన ఆరోపణలను ఖండించారు. తమ వ్యక్తిగత విషయాలు, కుటుంబం గురించి మాట్లాడడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో గొడవలు జరిగాయంటూ చేసిన ఆరోపణలను కొట్టిపడేశారు. తనకు డబ్బు మీద వ్యామోహం లేదనే విషయాన్ని ఆయన గ్రహించాలని హితవు పలికారు. ఆయన చేసిన ఆరోపణలు రుజువు చేయాలని సవాల్ విసిరారు. జోగు రామన్నపై ప్రతిపక్ష నేతలు చేసిన ఆరోపణలను గతంలో తిప్పికొట్టిన ఆయన అధికార పార్టీలోకి చేరి అవే ఆరోపణలు చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. అధికారం ఎన్నటికీ శాశ్వతం కాదని, ఇకనైనా నైతిక విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని కోరారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించండి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజానంద్‌నాయక్

నార్నూర్: గ్రామ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఎంపీ సోయం బాపురావును బుధవారం సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్ సర్పంచ్‌లతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి మంజూరు చేయాలని కోరారు. కేంద్ర పథకాలు గ్రామ పంచాయతీ పరిధిలో అమలయ్యేలా కృషి చేయాలని కోరారు. పెండింగ్ బిల్లులు చెల్లించేలా చూడాలన్నారు. నార్నూర్ గ్రామ పంచాయతీని మోడల్ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆయన వెంట సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, నాయకులు పరమేశ్వర్, ఉత్తం ఉన్నారు.

నేటి నుంచి ప్రవచనాలు



మాట్లాడుతున్న గోవర్ధన్

ఆదిలాబాద్: అయోధ్య శ్రీరామ జన్మభూమి మందిర ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో శ్రీమద్రామాయణంపై ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త శ్రీకృష్ణానందచే ఈనెల 18 నుంచి 22వరకు ప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తద్వనం కార్యదర్శి ఎస్. గోవర్ధన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఐదు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. 22న ఉదయం 11 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవంతో పాటు మధ్యాహ్నం 1 గంటలకు అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో తద్వనం కమిటీ సభ్యులు కుంట శ్రీనివాస్ రెడ్డి, కురుమెల్లి లింగన్న, తిప్పరెడ్డి లింగారెడ్డి, కోవ సీతారాం, ఉత్తర్ వార్ సుధాకర్, కళ్లెం కరుణాకర్ రెడ్డి, ఏనుగు శివ్వరెడ్డి, నానయ్య, భగవాండ్లు పాల్గొన్నారు.

నేటి నుంచి అఖండ రామానామ జపం

బోథ్: మండలంలోని కౌఠ(బి) గ్రామంలోని శబరిమాత ఆశ్రమంలో గురువారం నుంచి అఖండ రామానామ జపం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఐదు రోజుల పాటు రామానాయంతో పాటు ధ్యానం, భజన కార్యక్రమాలు చేయనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఈరోజు..

నేడు ఎంపీ పర్యటన

నేరడిగొండ: ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు మండలంలోని రోల్‌మామడ గ్రామంలో గురువారం పర్యటించనున్నట్లు బీజేపీ మండల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఏర్పాటు చేసే కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు, అధికార ప్రతినిధులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

అన్నదానం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీ బుధవారం ఆలయంలో అన్నదాన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందన్నారు. అన్నదానం కోసం విరాళాలు అందచేసే వారు ఆలయ కమిటీ వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.